# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 27 | ఆదివారం | 23-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:27 | Sunday | 23-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


### ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే

# అది ఎవరితప్పు?

- మెగా డీఎస్సీపై విమర్శలను తిప్పికొట్టిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో గ్రూప్ 1 పేపర్లు ప్లంబర్లతో దిద్దించారని ఆరోపణ
- రాజకీయ చెత్తను కూడా శుభ్రం చేయాలని ప్రజలకు పిలుపు
- గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారన్న సీఎం
- ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తామని హామీ



మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 సర్వీస్ పరీక్షల మూల్యాంకనంలో భారీ అవకతవకలు జరిగాయని, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇంట్లో పనిచేసేవారితో సమాధాన పత్రాలు దిద్దించిన వాస్తవాలు వెలుగు చూస్తుండటంతో, ఇప్పుడు డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఏఅనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలమండ కోడూరులో జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 300 పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగాలు ఇస్తుంటే, ఏడాది తర్వాత ఆరోపణలు చేస్తున్నారు.

2లో



### ప్రత్యేక సహకార వ్యవస్థ ఏర్పాటుకు

# రాష్ట్ర ప్రభుత్వం, కేంబ్రిడ్జ్ నిర్ణయం

- యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, స్టార్టప్‌ల అభివృద్ధికి కూడా సహకారం
- విశ్వవిద్యాలయ విద్యావేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి బృందం సమావేశం
- లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక రంగాల్లో భాగస్వామ్యానికి లివర్‌పూల్ ఆసక్తి
- అక్టోబర్‌లో రానున్న ప్రతినిధులు
- షార్ట్ కోర్సుల నిర్వహణకు ఇంపీరియల్ కళాశాల మొగ్గు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో లండన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం శనివారం ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తలతో సమావేశమైంది. తెలంగాణలో విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించింది. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలతోపాటు పరిశోధనల నిర్వహణ, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారం వంటి రంగాల్లో తెలంగాణ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కలిసి పనిచేసేందుకు ఒక ప్రత్యేక సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించాయి. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వం తరఫున సేవలందిస్తున్న మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్

### గచ్చిబౌలిలో కూలిన భవనం..

# ఇద్దరి దుర్మరణం

- గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం
- ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి
- అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు
- క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.



2లో

# మహిళలు ఎవరికీ బానిసలు కారు..

- మనుస్మృతి భావజాలంపై రాహుల్ గాంధీ ఫైర్
- పుణేలో విద్యార్థులతో రాహుల్ గాంధీ..
- మహిళలే దేశానికి అతిపెద్ద బలమన్న వ్యాఖ్య
- మనుస్మృతి భావజాలంపై తీవ్రంగా స్పందించిన రాహుల్
- వేదికపై గిరిజన విద్యార్థుల సమస్యలను ఏకరువు పెట్టిన విద్యార్థిని
- హాస్టళ్లలో పాముకాటు మరణాలు, బలవంతపు గర్భపరీక్షల ప్రస్తావన
- వారి నిరసనకు హాజరవుతానని హామీ ఇచ్చిన లోక్‌సభ ప్రతిపక్ష నేత

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, పితృస్వామ్య భావజాలంపై, ముఖ్యంగా 'మనుస్మృతి' నిర్దేశించిన పరిమితులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశానికి అసలైన బలం, ఆస్తి 70 కోట్ల మంది



2లో

# సంస్కరణలు పూర్తయ్యాయి..
# ఇక 100 శాతం ఫలితాలే లక్ష్యం

- విజయనగరం దాసన్నపేటలో క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం
- హాజరైన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ప్రతినెలా క్లస్టర్ స్కూల్ సమావేశాలకు హాజరవుతానని మంత్రి హామీ
- ఈ ఏడాది మరో 3 వేల టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం
- నైతిక విలువల పెంపునకు ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించామని వెల్లడి
- ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశంలోనే నంబర్ వన్ గా నిలుపుతామని ప్రకటన



రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణల శకం పూర్తయిందని, ఇకపై నూరు శాతం ఫలితాలు సాధించడమే అందరి లక్ష్యం కావాలని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయనగరం దాసన్నపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రజాప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు పూర్తయ్యాయని, ఇప్పుడు పూర్తిగా అభ్యసన ఫలితాలపైనే దృష్టి

మిగతా 2లో



# నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న సూత్రధారులను గుర్తించాలి

- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ
- తనను, తన కుటుంబాన్ని కొందరు నేతలు లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన
- విచారణ జరుగుతుండగా బహిరంగ విమర్శలు చేయడం సరికాదని సూచన
- ముఖ్యమంత్రిపై కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని చెప్పిన మల్లు రవి

2లో

# ఓట్ల కోసం వందేమాతరానికి అవమానమా?

- కాంగ్రెస్ తీరుపై బీజేపీ మండిపాటు
- జాతీయ పదాధికారుల భేటీలో ఏకగ్రీవ తీర్మానం
- నితిన్ నబీన్ అధ్యక్షతన తొలి సమావేశం సీడబ్ల్యూసీ తాజా నిర్ణయంపై మండిపాటు





# కాకినాడ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినుల ఫైట్..

- సెల్‌ఫోన్ పోయిందన్న ఫిర్యాదుతో మొదలైన వివాదం
- రోడ్డుపైకి వచ్చి దాడి చేసుకున్న ఏపీ, మణిపూర్ విద్యార్థినులు
- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ
- మణిపూర్ విద్యార్థినులను మరో హాస్టల్‌కు తరలింపు

## ఓట్ల కోసం వందేమాతరానికి అవమానమా?

న్యూఢిల్లీ: బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీ వందేమాతర గీతాన్ని అవమానిస్తోందని బీజేపీ ధ్వజమెత్తింది. వందేమాతరాన్ని రెండు చరణాలకే పరిమితం చేస్తూ ఆగస్టు 19న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని ఖండించింది. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన నూతనంగా ఏర్పాటైన జాతీయ పదాధికారుల తొలి సమావేశం శనివారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో వందేమాతరం ప్రతిష్టను, చారిత్రక ప్రాముఖ్యతను పరిరక్షించేందుకు 10 అంశాలతో కూడిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. వందేమాతరం గేయ విశిష్టతను చాటేలా, దాని ప్రాముఖ్యతపై యువతలో అవగాహన పెంచేలా దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని తీర్మానించింది. వందేమాతరాన్ని రెండు చరణాలకే పరిమితం చేస్తూ కాంగ్రెస్ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం దశాబ్దాల క్రితం ఆ పార్టీ చేసిన చారిత్రక తప్పిదాలకు కొనసాగింపేనని పదాధికారుల భేటీ అభిప్రాయపడింది. మరోవైపు, వందేమాతరానికి గేయం గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేసిందని బీజేపీ వెల్లడించింది. ఇటీవల ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై పూర్తి వందేమాతరాన్ని ఆలపించారు. కానీ అదే రోజు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పాడుతుండగా, రెండో చరణం తర్వాత ఆపేయాలని సోనియా గాంధీ సైగ చేసినట్లు బీజేపీ ఆరోపించింది. 1937 నాటి నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ రెండు చరణాలు మాత్రమే పాడే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆగస్టు 19న జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానించడాన్ని బీజేపీ విమర్శించింది.

## గచ్చిబౌలిలో కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

## నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న సూత్రధారులను గుర్తించాలి

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు. కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

## కాకినాడ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినుల ఫైట్..

(మొదటి పేజీ తరువాయి)

ఓ సెల్‌ఫోన్ వ్యవహారం నర్సింగ్ విద్యార్థినుల మధ్య పెద్ద ఘర్షణకు దారితీసింది. కాకినాడలోని ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులు రోడ్డుపైకి వచ్చి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న మణిపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని తన సెల్‌ఫోన్ కనిపించడం లేదని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఫోన్ దొరికినప్పటికీ, ఈ విషయంపై విద్యార్థినుల మధ్య వివాదం సద్దుమణగలేదు. మాటామాటా పెరిగి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. రెండు వర్గాల విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి రోడ్డుపైనే ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ దాడిలో పలువురు విద్యార్థినులకు స్వల్ప గాయాలవగా, ఇద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే కళాశాల వద్దకు చేరుకున్నారు. ఆర్డీవో, ట్రైనీ జేసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అధికారులు తక్షణ చర్యగా మణిపూర్‌కు చెందిన విద్యార్థినులను వేరే హాస్టల్‌కు తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో అసలు కళాశాలకు సరైన అనుమతులు ఉన్నాయా, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు ఎలా ఉన్నాయి అనే కోణంలో అధికారులు విచారణ ప్రారంభించారు.

# ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే అది ఎవరితప్పు?

(మొదటి పేజీ తరువాయి)

ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తేకపోతే అదెవరి తప్పు? క్రీడా కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి ఉద్యోగాలిస్తే, ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారమే క్రీడాకారులకు ప్రాధాన్యం ఇచ్చాం. ఎవరో ఎక్కడో డబ్బులు అడిగారని మొత్తం డీఎస్సీకి అంటగట్టడం దుర్మార్గం. గొడ్డలి పార్టీ అధినేత పీఏ వందల కోట్లు సంపాదించారు, దాని గురించి ఎవరూ మాట్లాడరేం?" అని నిలదీశారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఐదేళ్ల పాటు గొడ్డలి పార్టీ విధ్వంసాలు, నేరాలు, ఘోరాలనే నమ్ముకుంది. వారి హయాంలో సరఫరా చేసిన నకిలీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారు. కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి, తమకు నచ్చని వారి భూములను 22ఏ జాబితాలో పెట్టారు. ఆ దుర్మార్గాలను సరిదిద్దడానికే మాకు మూడేళ్ల సమయం పడుతోంది. ఇప్పుడు మేం ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచారు"



అని చంద్రబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెండింతల సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి పనులు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "గత పాలకులు సంక్షేమం ఇస్తున్నామని చెప్పి రోడ్లు కూడా వేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక రోడ్ల రూపురేఖలు మార్చాం. ప్రజలు ఈ చెత్తతో పాటు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలదే. అప్పుడే రాజకీయ నేతలూ తప్పులు చేయరు" అని పిలుపునిచ్చారు. 'దీపం 2.0' ద్వారా నాలుగు నెలలకు ఒకసారి మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను ఆడబిడ్డల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో ఇప్పుడు ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు వస్తున్నారని, ప్రపంచాన్ని జయించే విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి మన ఉపాధ్యాయులకు ఉందని అన్నారు. ప్రతి గ్రామం 'జీరో వేస్ట్' గ్రామంగా మారాలని ఆకాంక్షించారు. "రెండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశాం. చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నాం. స్వచ్ఛ రథాల ద్వారా చెత్త సేకరించి, నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. 'స్వయం' పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం" అని వివరించారు. ఈ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభిస్తున్నామన్నారు. వచ్చే నెలలోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరందిస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని, 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ నిర్మిస్తామని చెప్పారు. స్థానిక యువతకు స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యాలు అందిస్తామన్నారు. రూ.29 కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు మంచి చెడులను విశ్లేషించి, మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు.

## సంస్కరణలు పూర్తయ్యాయి.. ఇక 100 శాతం ఫలితాలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



సారించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. గత ఏడాది సంస్కరణల ఫలితంగా అద్భుతమైన ఫలితాలు వచ్చాయని, అయితే ఇది తొలిమెట్టు మాత్రమేనని లోకేశ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఫలితాలతో సంతృప్తిగా లేరని, నూరు శాతం ఫలితాలనే ఆశిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల క్షేత్రస్థాయి సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ఇకపై ప్రతినెలా ఒక క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరవుతానని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో ఒత్తిడి లేని విధంగా వినూత్న పద్ధతుల్లో మెళకువలు నేర్పాలని సూచించారు. యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో వలస కుటుంబాలను, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను చూసి చలించిపోయానని, అప్పుడే విద్యారంగంలో సంస్కరణలు తేవాలని నిర్ణయించుకున్నానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. విద్యాశాఖ ఎంతో సవాలుతో కూడుకున్నదైనా, సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని తాను నమ్ముతానని పేర్కొన్నారు. విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక 10 వేల పాఠశాలల్లో 'వన్ క్లాస్ వన్ టీచర్' విధానం తెచ్చామని, డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని వివరించారు. ఈ ఏడాది మరో డీఎస్సీ ద్వారా అదనంగా 3 వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించడం, ఉత్తమ ఉపాధ్యాయులను శిక్షణ కోసం సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు పంపడం వంటివి చేపట్టామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల ఆలోచనా విధానం కూడా మారుతోందని, వారిని అర్థం చేసుకుని బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ నేపథ్యంలో నైతిక విలువల ఆవశ్యకతను గుర్తించి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు గారి ద్వారా ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులపై బోధనేతర భారాన్ని పూర్తిగా తగ్గించామని, వారికి అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు. రాబోయే ఐదేళ్లలో దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అత్యుత్తమ విద్యావిధానాన్ని రూపొందించడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మహిళలు ఎవరికీ బానిసలు కారు..


(మొదటి పేజీ తరువాయి)

మహిళలేనని ఆయన స్పష్టం చేశారు. శనివారం పుణెలో "ఛాత్రోం కీ గూంజ్" కార్యక్రమంలో భాగంగా 'పింజ్రా తోడా' (పంజరాన్ని బద్దలుకొట్టండి) అనే థీమ్‌తో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "దేశానికి అతిపెద్ద బలం ఏమిటని అడిగితే ఆర్థిక వ్యవస్థ, సైన్యం, జనాభా అంటూ రకరకాల సమాధానాలు చెబుతారు. కానీ నా దృష్టిలో భారతదేశానికి ఉన్న 70 కోట్ల మంది మహిళలే దేశానికి అతిపెద్ద శక్తి" అని అన్నారు. మహిళలు ఎవరికీ బానిసలు కారని ఉద్ఘాటించారు. బాల్యంలో ఉన్నప్పుడు తండ్రికి పనులు చేసిపెట్టడం కోసం, యవ్వనంలో భర్త కోసం, ఆ తర్వాత వృద్ధాప్యంలో కొడుకుల కోసం మహిళలు బతకాలనే మనుస్మృతి భావజాలం సిగ్గుచేటని విమర్శించారు. కుమార్తె, భార్య, తల్లి వంటి పాత్రలకే పరిమితం కాకుండా మహిళలు తమకంటూ ఒక సొంత గుర్తింపును ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిషా అనే గిరిజన విద్యార్థిని ప్రసంగం అందరినీ కదిలించింది. గిరిజన విద్యార్థుల సమస్యలను ఆమె రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చారు. పుణేలోని మంజరి ప్రాంతంలో తమ డిమాండ్ల సాధన కోసం గిరిజన విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్నారని, వారి దుస్థితిని వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన హాస్టళ్లలో కనీస వసతులు లేవని, 70-80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల నుంచి ఆహారం సరఫరా చేయడం వల్ల అది పాడైపోయి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడ్చిరోలిలోని ఆశ్రమ పాఠశాలలో పాముకాటు కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని నిషా తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన గిరిజన విద్యార్థినులకు హాస్టళ్లలో బలవంతంగా గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని చెప్పడంతో సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఈ సమస్యలపై మంత్రులను కలిస్తే ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందని చేతులెత్తేశారని, అలాంటప్పుడు వారికి పదవిలో ఉండే అర్హత లేదని ఆమె నిలదీశారు.

## ప్రత్యేక సహకార వ్యవస్థ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, కేంబ్రిడ్జ్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభు, అదే సంస్థకు చెందిన కో--చైర్, 'ఫ్రూగల్ ఏఐ' సహ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ వెంకట శిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై వారు సానుకూలంగా స్పందించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను తెలంగాణ రైజింగ్ బృందం.. కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించింది. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూర్చనుందని సీఎంఓ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.



### అక్టోబర్‌లో రాష్ట్రానికి లివర్‌పూల్ బృందం...

లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ రంగాల్లో తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి లివర్‌పూల్ సంస్థ ఆసక్తి చూపింది. లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. లివర్‌పూల్‌తో భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి ఆ సంస్థ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది.

### ఇంపీరియల్ కళాశాల ఆధ్వర్యంలో షార్ట్ కోర్సులు..

హైదరాబాద్ సహా తెలంగాణలో షార్ట్‌టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని లండన్‌లోని ప్రతిష్టాత్మక ఇంపీరియల్ కళాశాల అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్ తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కలిసి పనిచేసేందుకు ఆసక్తి ఉందని వెల్లడించారు. లండన్‌లోని ఇంపీరియల్ కళాశాలను సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు సందర్శించి అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రాలాసియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో సమావేశమయ్యారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు విచ్చేయాలని ఇంపీరియల్ కళాశాల ప్రతినిధులను ఆహ్వానించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ (స్టెమ్), బిజినెస్ ఎడ్యుకేషన్ రంగాల్లో ఇంపీరియల్ కాలేజీ ప్రపంచంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.



## ప్రభుత్వ బడుల అభివృద్ధిలో దాతలదే కీలకపాత్ర

- లక్ష రూపాయల ఆర్థిక సాయం, విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత
- పిల్లలను సర్కారు బడిలోనే చదివించాలి: సర్పంచ్ లక్ష్మయ్య

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం దాతలు అందిస్తున్న సహకారం కీలకమని మెహర్‌నగర్ గ్రామ సర్పంచ్ చెలివేరు లక్ష్మయ్య అన్నారు. దాతల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతున్నాయని పేర్కొన్నారు. మెహర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాత అనంతుల వీరారెడ్డి ఆధ్వర్యంలో రెండు జతల క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో సేవలందిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయుల వేతనాల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సర్పంచ్ చెలివేరు లక్ష్మయ్య చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలకు తోడు దాతల సహకారం అందడంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతున్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనూ నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, సర్కారు బడుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం రేగటి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ కేసారం పూజిత సంపత్‌రెడ్డి, వార్డు సభ్యులు బూరుగు వెంకటేష్, కోట ప్రశాంత్, కళ్లెం సాయిలు, చెక్క అనిత, రాసునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి విద్యాలయంలో ఘనంగా బోనాల వేడుకలు

- సాంప్రదాయానికి అద్దం పట్టిన విద్యార్థుల వేషధారణలు
- ఆకట్టుకున్న చిన్నారుల అమ్మవారు, పోతురాజు వేషాలు



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం బోనాల వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ అమ్మవార్ల వేషధారణలతో పాటు పోతురాజు వేషాలు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు, వారి ఉత్సాహం చూపరులను ఎంతగానో అలరించాయి. బోనాలతో విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడంతో పాటు వాటిపట్ల గౌరవ భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తౌర్ర విష్ణు, ప్రిన్సిపల్ పంజాల నరసయ్య, వైస్ ప్రిన్సిపల్ కొమరిశెట్టి ఐలయ్య, ఉపాధ్యాయులు చెరుకు విష్ణు, యాసిన్, సుధాకర్, లలిత, సంతోష, మహేశ్వరి, సంధ్య, మాధవి, రేణుక, లక్ష్మి, లావణ్య, స్వాతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి మాలి శంకర్‌రెడ్డి సస్పెన్షన్

- అత్యాచార ఆరోపణల నేపథ్యంలో మండల కమిటీ నిర్ణయం

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** మండల పరిధిలోని పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాలి శంకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందడి అనంతరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు మాలి శంకర్‌రెడ్డిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో మండల కాంగ్రెస్ కమిటీ నిర్ణయాన్ని ప్రకటించారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని, ఆరోపణలపై క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు గౌడ్, ప్రధాన కార్యదర్శి జన్నాయి కోడె నగేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తండ శ్రీశైలం గౌడ్, భాషబోయిన పాపయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ గౌడ్, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు ఎద్దు వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలగందుల మహేష్, కొరటికల్ ఉప సర్పంచ్ మామిడి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో ఉద్యోగాలు






- కార్మికులందరికీ కనీస వేతనాలు అందించడమే లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి
- గిగ్ వర్కర్ల రక్షణకు ప్రత్యేక చట్టం
- ఎల్బీనగర్‌లో కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం

**తొలివెలుగు, ఎల్బీనగర్:** అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ నిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో శనివారం నిర్వహించిన 'తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్' 6వ వార్షికోత్సవ సభకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు కావాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమని, గిగ్ వర్కర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం మంత్రి వివేక్ నిరంతరం కృషి చేస్తున్నారని, కనీస వేతన జీవో విడుదలే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పన్యాల జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, యూనియన్ అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, చామకూర రాజు, కె.వి. గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండానే కాలువ మట్టి తరలింపు?





- పోసానికుంట స్టేజీ సమీపంలో జేసీబీలతో తవ్వకాలు..
- వందలాది టిప్పర్లలో మట్టి తరలింపు ఆరోపణలు
- అడిగితే ఇరిగేషన్ శాఖ అనుమతులు ఉన్నాయంటూ గుత్తేదారు సిబ్బంది బుకాయింపు

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల కేంద్రంలోని పోసానికుంట స్టేజీ సమీపంలో ఉన్న భూనాదిగాని కాలువ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేసీబీలతో తవ్వకాలు చేపట్టి వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మకూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లో కొందరు అక్రమంగా తవ్వకాలు జరిపి ఎర్రమట్టి, మొరం తదితర మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలు, తరలింపునకు సంబంధించి నిబంధనల ప్రకారం మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అవసరమైన మట్టి పరిమాణానికి అనుగుణంగా దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపి, సంబంధిత అధికారుల అనుమతులు పొందాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే పోసానికుంట సమీపంలోని కాలువ నుంచి మట్టిని తరలిస్తున్న వారిని ప్రశ్నిస్తే ఇరిగేషన్ శాఖ అనుమతులు ఉన్నాయని గుత్తేదారు సిబ్బంది చెబుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అనుమతి పత్రాలు, మట్టి తరలింపునకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి తవ్వించిన సాగునీటి కాలువలోని మట్టిని భారీగా తరలిస్తుండటంపై రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, గుట్టలు, ప్రభుత్వ, పట్టా భూముల్లో తవ్వకాలు చేపట్టే ముందు తప్పనిసరిగా నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి, మట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయా? లేక అక్రమంగా జరుగుతోందా? అనే విషయాన్ని తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు, మట్టి తరలింపు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలి

- రామన్నపేట కోర్టు హాలులో సమన్వయ సమావేశం
- కక్షిదారులకు శీఘ్ర న్యాయం అందించడమే లక్ష్యం: సీనియర్ సివిల్ జడ్జి సబిత

**తొలివెలుగు, రామన్నపేట:** సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ జి. సబిత సూచించారు. శనివారం రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జడ్జి సబిత మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను ముందస్తుగానే గుర్తించి, కక్షిదారులతో మాట్లాడి స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. సత్యయ్యలతో పాటు రామన్నపేట ఎస్ఐ, మోత్కూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.




## రాష్ట్రపతి పోలీసు అవార్డు గ్రహీత నరసయ్యకు అభినందనలు

- లక్ష్మాపురం గ్రామస్థుల హర్షం
- ఊరికి గర్వకారణంగా నిలిచారన్న పలువురు

**తొలివెలుగు, రామన్నపేట:** సికింద్రాబాద్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ) జోగుల నరసయ్య రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ పోలీసు అవార్డు అందుకున్న సందర్భంగా రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన పలువురు శనివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మాపురం గ్రామానికి చెందిన మాజీ తొలి సర్పంచ్ జోగుల రామలింగయ్య కనిష్ఠ పుత్రుడైన నరసయ్య.. చిన్నతనం నుంచే కష్టపడి, మారుమూల గ్రామం నుంచి ఉన్నత స్థాయి పోలీసు అధికారిగా ఎదిగి రాష్ట్రపతి అవార్డు సాధించడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణమని కొనియాడారు. విధినిర్వహణతో పాటు గ్రామ అభివృద్ధికి కూడా ఆయన ఎంతో సహకరించారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంభాల వెంకటేష్, నీల ఐలయ్య, మరోజు అనంతచారి, బత్తిని వెంకటేష్, వేముల పాపయ్య, బత్తుల రమేష్, ఆరూరి నరేష్ పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు ఇబ్రహీం సంతాప సభ

- సోమవారం దుర్గయ్య కాంప్లెక్స్‌లో ఏర్పాటు
- పాల్గొనాలని శశిధర్‌రెడ్డి, వెంకటేశం కోరిన సీనియర్ జర్నలిస్టులు



**తొలివెలుగు, రామన్నపేట:** ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయులు మొహమ్మద్ ఇబ్రహీం సంతాప సభను ఈనెల 24వ తేదీ సోమవారం రోజున మండల కేంద్రంలోని దుర్గయ్య కాంప్లెక్స్‌లోని మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీనియర్ పాత్రికేయులు కనతాల శశిధర్‌రెడ్డి, బూరుగు వెంకటేశం తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇబ్రహీం 1975 నుంచి 2026 వరకు సుమారు 51 ఏళ్ల పాటు పాత్రికేయ వృత్తిలో కొనసాగారని కొనియాడారు. ఉన్నతమైన విలువలు, నిబద్ధతతో జర్నలిజం రంగానికి సేవలుందించిన ఆయన మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంతో అనుబంధం ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, మిత్రులు, తోటి పాత్రికేయులు ఈ సంతాప సభకు హాజరై నివాళులర్పించాలని కోరారు.

# యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేష్ కుమార్

- నియామక పత్రం అందజేసిన గొర్ల ఐలయ్య యాదవ్
- యాదవ సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్న అందెల



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంలోని పిల్లాయిపల్లి గ్రామానికి చెందిన అందెల మహేష్ కుమార్ యాదవ్ రాష్ట్ర యాదవ చైతన్య వేదిక ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యాదవ చైతన్య వేదిక అధ్యక్షుడు గొర్ల ఐలయ్య యాదవ్ శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, కుల సంఘాలను బలోపేతం చేసి వారిని చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీర్ల ఐలయ్య యాదవ్, నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, కడారి మహేష్ యాదవ్‌లకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందే వెసులుబాటు
- వెల్లడించిన రెవెన్యూ కార్యదర్శి దశరథం



**తొలివెలుగు, చిన్నగూడూరు :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ప్రభుత్వ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యదర్శి దశరథం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం అందించిన రేషన్ కార్డుల మాదిరిగానే ఈ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్డు ఉన్నవారు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు పొందే సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బత్యం రమేష్, ఉప సర్పంచ్ గాడిపెల్లి జీవన్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుధగాని నాగేష్, మండల నాయకులు గంగరబోయిన శ్రీను, దాసరి శీను, ఉపేందర్, శేఖర్, మధు, రామచంద్రు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో టయోటా కార్ల ఎక్స్‌చేంజ్ మేళా

- ఉత్సాహంగా సాగుతున్న 'గ్రామీణ మహోత్సవం'
- సద్వినియోగం చేసుకోవాలన్న సేల్స్ ఆఫీసర్ మనీష్

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల కేంద్రంలో హర్ష టయోటా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గ్రామీణ మహోత్సవం' కార్ల ఎక్స్‌చేంజ్ మేళా రెండో రోజు ఉత్సాహంగా సాగింది. స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా నిర్వహిస్తున్న ఈ మేళాకు వాహన ప్రియుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి బ్రాంచ్ సేల్స్ ఆఫీసర్ మనీష్ మాట్లాడుతూ.. మేళాలో కొత్త కార్ల కొనుగోలుతో పాటు పాత కార్ల ఎక్స్‌చేంజ్, వాహనాల వాల్యుయేషన్, యూజ్డ్ కార్ల విక్రయాలు, ఈజీ ఫైనాన్స్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రత్యేక మేళా ఆదివారం కూడా కొనసాగుతుందని, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, వాహన ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్లు సాయిలు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# కాలుష్యకారక కెమికల్ కంపెనీలను మూసివేయాలి





- బాధితులకు ఒక్కొక్కరికి రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హెజిలో కంపెనీ ఎదుట భారీ ధర్నా

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పచ్చని పల్లెలను కాలుష్యానికి గురిచేస్తూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రసాయన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుని నిబంధనలు పాటించని కాలుష్యకారక పరిశ్రమలను వెంటనే మూసివేయాలని ప్రజా సంఘాల నాయకులు కల్లూరి మల్లేష్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని దోతిగూడెం గ్రామ పరిధిలోని హెజిలో కెమికల్ కంపెనీలో ఇటీవల జరిగిన రియాక్టర్ ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనను నిరసిస్తూ శనివారం ప్రజా సంఘాల నాయకులు, గ్రామ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు కంపెనీ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు.

## నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమా?

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించకపోవడం, యాజమాన్యాల నిర్లక్ష్యమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని ఆరోపించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, తీవ్రంగా గాయపడిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రసాయన కంపెనీల ధనార్జన కోసం పచ్చని గ్రామాలను కాలుష్య బారిన పడేస్తున్నారని విమర్శించారు. కంపెనీల నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామ, పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత జూలై నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ఇది రెండో ప్రమాదమని, రియాక్టర్ల పేలుళ్లతో పర్యావరణం, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని కంపెనీలపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, పునరావృతమవుతున్న ప్రమాదాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాట జంగయ్య, మాజీ సర్పంచులు తగిళ్ల రామిరెడ్డి, బాల మల్లేష్, ఉపసర్పంచ్ బద్దం వెంకట్‌రెడ్డి, నాయకులు కోట రామచంద్రారెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, మంచాల మధు, ప్రసాదం విష్ణు, పల్లెకాడి బసవయ్య, యువజన నాయకుడు ముద్దం సత్యం తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రీశుడి సేవలో పందళం రాజా



- లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న రాజా తిరునల్ సురేష్ వర్మ
- స్వామివారి సేవల్లో పాల్గొన్న పందళం రాజమందిర ప్రతినిధులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని పందళం శ్రీ అయ్యప్ప స్వామి వారి రాజమందిర రాజా శ్రీశ్రీశ్రీ రాజా తిరునల్ సురేష్ వర్మ శనివారం దర్శించుకున్నారు. కొండపైకి చేరుకున్న పందళం రాజమందిర రాజాతో పాటు పందళం ప్రతినిధులకు ఆలయ అధికారులు, అర్చక బృందం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయంలో స్వామివారిని దర్శించుకున్న రాజా తిరునల్ సురేష్ వర్మ, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి సేవల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి శ్రీస్వామివారి దివ్య తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. యాదాద్రీశుడి క్షేత్ర ప్రాశస్త్యం, ఆలయ విశేషాలను ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వివరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పందళం రాజమందిర ప్రతినిధులు ప్రదీప్ తాంతి, శ్రీనివాస్ గురుస్వామి, బాలు రెడ్డి, దర్శన గురుస్వామిలతో పాటు పలువురు అయ్యప్ప భక్తులు, ఆలయ ముఖ్య అధికారులు, అర్చకులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపల్లిలో ఉచిత సీఎస్‌సీ వైద్య శిబిరం

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లేబర్ కార్డుదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రక్తం, మూత్రం, ఈసీజీ, షుగర్ పరీక్షలతో పాటు మొత్తం 136 రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్మికులు, పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్థులు, లేబర్ కార్డుదారులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగుల సత్యనారాయణ, ఇన్‌చార్జ్ పూనూరు శ్రీలక్ష్మి, కల్వల హరికృష్ణ, మెట్టు మధు, లలిత భాస్కర్‌రెడ్డి, దయ్యాల రాజ తదితరులు పాల్గొన్నారు.







# బత్తిని సత్యనారాయణ గౌడ్‌కు 'గురు పురస్కార' ప్రదానం

- అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మిక చైతన్యం తెచ్చిన గురుస్వామి
- త్యాగరాయ గానసభలో పురస్కారం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, గురుస్వామి బత్తిని సత్యనారాయణ గౌడ్ ప్రతిష్ఠాత్మక 'గురు పురస్కారం' అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో శనివారం మహాశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పందల రాజ వంశీయులు సురేష్ వర్మ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును, ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గత 33 సంవత్సరాలుగా అయ్యప్ప దీక్షా నియమాలను క్రమశిక్షణతో ఆచరిస్తూ, యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకుగాను సత్యనారాయణ గౌడ్‌ను ఈ పురస్కారం వరించింది.

# ఘనంగా సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి

- రాజాపేటలో నివాళులర్పించిన సీపీఐ నాయకులు
- పేదల పక్షపాతి సురవరం: చిగుళ్ల లింగం




**తొలివెలుగు, రాజాపేట:** సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం రాజాపేట మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. సురవరం సుధాకర్ రెడ్డి పార్లమెంటులో పేదల హక్కుల కోసం, పలు ప్రజా సంక్షేమ చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు (ఆర్.టీ.ఐ) చట్టం ఆమోదం పొందడంలో ఆయన పాత్ర అపారమైనదని కొనియాడారు. తన ఎంపీ నిధుల ద్వారా ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఎంతో కృషి చేశారని తెలిపారు. నిరంతరం పేద ప్రజల సంక్షేమం గురించే ఆలోచించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మూలపోచయ్య, నాయకులు గన్నమల్ల రాజయ్య, రాములు, సిద్ధులు, శీను, మంగ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్‌గా పాక మల్లేష్ యాదవ్

- డైరెక్టర్లుగా 12 మంది నియామకం
- అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని కనుముక్కల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పీఏసీఎస్ పాలకవర్గ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లుగా 12 మందిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. డైరెక్టర్లుగా కరుణాకర్‌రెడ్డి, సామల రాజిరెడ్డి, గుండ్ల వేణు, రావుల అనిల్, వారాల రామచంద్రారెడ్డి, చెక్క వెంకటేష్, డి. మల్లేష్, ఆర్ల ఐలయ్య, యాట కైలాసం, పావురాల లింగమ్మ, రమావత్ చంద్రు, సరిపెల్లి రాములమ్మలను నియమించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా పాక మల్లేష్ యాదవ్ ఎన్నిక కావడంతో కనుముక్కల గ్రామంతో పాటు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. రైతుల అభ్యున్నతి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## అక్రమ మద్యం విక్రేతపై కేసు నమోదు

- రూ.7,150 విలువైన 6.5 లీటర్ల మద్యం సీజ్
- పాముకుంటలో పోలీసుల తనిఖీలు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం పాముకుంట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రంగ రామస్వామి (50) అనే వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ కొండ యాదయ్య ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితుడి వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన సుమారు 6.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.7,150 ఉంటుందని పోలీసులు తెలిపారు. రాజాపేటలోని వైన్ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి పాముకుంట గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి, నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో అరాచకం.. హామీల అమలులో వైఫల్యం

- అంతర్గత కుమ్ములాటలతో స్తంభించిన పరిపాలన
- బీఆర్ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ విమర్శ




**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి అంతర్గత కుమ్ములాటలకే పరిమితమైందని బీఆర్ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ విమర్శించారు. శనివారం చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకపోవడంతో రాష్ట్ర పరిపాలన పూర్తిగా స్తంభించిపోయిందని ఆరోపించారు. వేలాది మంది పేద విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను పెండింగ్‌లో పెట్టి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు, ఆరు గ్యారెంటీల అమలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా నాయకులు కుమ్ములాటలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో విద్యార్థి, నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌వీ మునుగోడు ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి, కార్యదర్శులు గుమ్మాల ప్రవీణ్ కుమార్, ముటుకులోజు రాఘవ, నాయకులు పిల్లలమర్రి సాయి, గంగాదేవి శివ, పానుగోతు తరుణ్ నాయక్, గట్టు హరి సుందర్, అరుణ్, ఎండీ అత్తు, శమల చింటు తదితరులు పాల్గొన్నారు.


## నీటి గుంతల నిర్మాణంతోనే భూగర్భ జలాలు

**ఫాం పాండ్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్ దివాకర**

కూసుమంచి, ఆగస్టు 22 : నీటి గుంతల నిర్మాణంతోనే భూగర్భ జలాలు పెరుగుతాయని, వీటి నిర్మాణం ఒక యజ్ఞంలా సాగాలని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. కూసుమంచిలోని పల్లపు ప్రాంతంలో వర్షపు నీటి నిల్వ కోసం రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు తీసిన ఫాం పాండ్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించి, రైతును అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ రైతు ఇలా ఆలోచించి ఆచరణలో పెడితే పక్కనే ఉన్న బోరు బావుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు వర్షపు నీటి నిల్వ కోసం తీసిన గుంతలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఫాం పాండ్స్ నిర్మాణాలపై రైతులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల జరిగే లాభాల గురించి తెలియజేస్తే రైతులు ముందుకొస్తారని, వీటి నిర్మాణంతో భూమి తగ్గుతుందని భావించడం ఒక అపోహ మాత్రమేనన్నారు. ఫాం పాండ్స్‌లో చేపలు, రొయ్యలు కూడా పెంచుకోవచ్చని, వ్యవసాయానికి అనుబంధంగా అదనపు ఆదాయం కూడా రైతులకు సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జశ్వంత్‌కుమార్ తహసీల్దార్ సైదులు, ఏవో రామడుగు వాణి, ఏపీవో అప్పారావు, ఈసీ కరుణ, సర్పంచ్ కొండా కృష్ణవేణి, పంచాయితీ కార్యదర్శి నీరజ, ఏఈవో జానీబాబా పాల్గొన్నారు.

# జన్నారంలో కాళేశ్వరం ఇసుక దందా?

- ట్రక్కుల్లో ఇసుక తెచ్చి ట్రాక్టర్లతో విక్రయాల ఆరోపణలు
- ఒక్కో ట్రిప్పుకు రూ.6,500 వరకు వసూలు చేస్తున్నారంటున్న బాధితులు
- పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఇసుక ధరల భారం
- అనుమతులు, వే బిల్లులపై అధికారుల తనిఖీలు చేపట్టాలని డిమాండ్




**తొలివెలుగు, జన్నారం:** మండల కేంద్రంలో ఇసుక విక్రయాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాంతం నుంచి ట్రక్కుల్లో ఇసుకను తీసుకొచ్చి, స్థానికంగా ట్రాక్టర్ల ద్వారా కొత్త ఇళ్ల నిర్మాణాల కోసం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ట్రిప్పుకు సుమారు రూ.6,500 వరకు వసూలు చేస్తున్నారని ఇసుక కొనుగోలు చేస్తున్న బాధితులు వాపోతున్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలని భావిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇసుక ధరలు భారంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ సామగ్రి ధరలు ఇప్పటికే పెరిగిన నేపథ్యంలో ఇసుక కోసం కూడా వేల రూపాయలు చెల్లించాల్సి రావడంతో ఇళ్ల నిర్మాణ వ్యయం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ట్రక్కుల్లో తెచ్చి.. ట్రాక్టర్లతో అమ్మకాలు?**

కాళేశ్వరం వైపు నుంచి ట్రక్కుల్లో ఇసుకను తీసుకొచ్చి, జన్నారంలో ట్రాక్టర్లలోకి మార్చి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఇసుకకు సంబంధించి అధికారిక అనుమతులు ఉన్నాయా? రవాణా పత్రాలు, వే బిల్లులు సక్రమంగా ఉన్నాయా? ఏ ఇసుక రీచ్ నుంచి ఇసుకను తీసుకొచ్చారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందని స్థానికులు అంటున్నారు.

**కొత్త ఇళ్ల పేరుతోనే అధిక ధరల వసూళ్లా?**

కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఇసుకకు ఉన్న డిమాండ్‌ను కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణం పేరుతో ఇసుకను తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారా? లేక నిబంధనలకు అనుగుణంగానే సరఫరా చేస్తున్నారా? అనే విషయంపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**రూ.6,500 ధరపై బాధితుల ఆవేదన:**

"ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక తప్పనిసరి. ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.6,500 వరకు చెల్లించాల్సి వస్తోంది. సామాన్య కుటుంబాలకు ఇది చాలా భారంగా మారింది. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా అందుబాటు ధరల్లో ఇసుక సరఫరా చేయాలి" అని బాధితులు కోరుతున్నారు.

**తనిఖీలు చేపట్టాలని డిమాండ్:**

జన్నారంలో కాళేశ్వరం నుంచి వస్తున్నట్లు చెబుతున్న ఇసుక ట్రక్కులు, అనంతరం ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న విక్రయాలపై రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇసుకకు సంబంధించిన అనుమతులు, వే బిల్లులు, రవాణా మార్గం, విక్రయ ధర, ట్రాక్టర్ల వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జన్నారంలో ఇసుక విక్రయాలపై వస్తున్న ఆరోపణలు నిజమేనా? ఇసుకకు రూ.6,500 వరకు వసూలు చేస్తున్నది ఎవరు? కాళేశ్వరం నుంచి ఇసుకను తీసుకొచ్చేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# పదో తరగతి ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు






- రూ.40 వేల బహుమతులు అందజేసిన పూర్వ విద్యార్థులు
- శ్రీ వెంకటేశ్వర జెడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా ప్రదానోత్సవం

**తొలివెలుగు, వలిగొండ:** విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో 1976–77 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బోదాసు గంగాభవాని, పర్వతం అనిత, కళ్లెం హదస్త్రా, తెలుచూరి అక్షయ, గుర్రం స్పందన, ఆలకుంట్ల మానస అనే ఆరుగురు విద్యార్థులకు దాతలు మొత్తం రూ.40 వేల నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు మెమెంటోలు అందజేసి అభినందించారు. అలాగే ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన తొమ్మిదో తరగతి విద్యార్థి బెలిదె వర్ధన్‌కు నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్ మాట్లాడుతూ.. పుట్టిన గడ్డను, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను గుర్తుంచుకుని విద్యార్థుల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు ఈ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రిటైర్డ్ ఈఈ గోళ్ల అనిల్, ఇస్రో రిటైర్డ్ ఉద్యోగిని గూడూరు రాణి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సోలిపురం అనిత, రిటైర్డ్ ఉద్యోగులు సింహాద్రి లింగయ్య, డెన్నిస్, చిట్టి సాయిలు, ఉపాధ్యాయులు పోలెపాక నాగేందర్, సైదారెడ్డి, మల్లేశం, నవీన్, శివాజీ, జీలానీ, స్వామిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో పవిత్రోత్సవాలు ప్రారంభం





- నేటి నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- దోష పరిహారార్థం ప్రత్యేక పూజలు.. పాల్గొన్న ఈవో భవానీ శంకర్, అధికారులు
- పవిత్రోత్సవాల నేపథ్యంలో నిత్య, శాశ్వత సేవలు రద్దు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో దోష పరిహారార్థం నిర్వహించే పవిత్రోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పవిత్రోత్సవాల తొలిరోజు స్వస్తివాచనం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో భవానీ శంకర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దోష పరిహారార్థం పవిత్రోత్సవాలు:**

ఆలయంలో ఏడాది పొడవునా నిర్వహించే వివిధ పూజలు, ఉత్సవాల సందర్భంగా ఏర్పడే దోషాల పరిహారార్థం పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి.దపవిత్రోత్సవాల నేపథ్యంలో భక్తులు నిర్వహించే స్వామివారి నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం, లక్ష పుష్పార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమం తదితర సేవలను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# అమెరికా పర్యటన రద్దు అందుకేనా!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రచారం చేసుకున్న తెలంగాణ రైజింగ్ విదేశీ యాత్రలో భాగంగా అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం చర్చకు దారితీసింది. కేంద్రం రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించలేదని, సీఎం ప్రతిపాదించిన అమెరికా పర్యటన కార్యక్రమం ఆయన పదవికి, పర్యటన ఉద్దేశానికి తగిన విధంగా లేదని విదేశాంగశాఖ స్పష్టం చేయడం రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన అవగాహనా లోపానికి నిదర్శనం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రం నిర్ణయంలో రాజకీయ కోణం ఉన్నదని ఆరోపిస్తున్నది. ఈ నేపథ్యంలో అసలు లోపం ఎక్కడుంది? కేంద్రంలోనా, రాష్ట్ర ప్రభుత్వ పర్యటన ప్రణాళికలోనా అనేదే ఇప్పుడు ప్రశ్న. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటన సాధారణ వ్యక్తిగత పర్యటన కాదు. ఆ యన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతినిధి. అందువల్ల ఎవరిని కలుస్తారు? ఎందుకు కలుస్తారు? ఆ సమావేశాల వల్ల రాష్ట్రానికి, దేశానికి ఏం ప్రయోజనం? ఎంత పెట్టుబడి వచ్చే అవకాశం ఉన్న ది? ఎన్ని ఉద్యోగాలు సృష్టించగలరు? ఏ సాంకేతికత లేదా విద్యా భాగస్వామ్యాలు ఏర్పడుతా యి? గతంలో కుదుర్చుకున్న ఎంవోయూ లో ఎ న్ని అమలయ్యాయి? వంటి అంశాలతో స్పష్టమై న ప్రణాళిక ఉండాలి. ప్రభుత్వ ఖర్చుతో విదేశాలకు వెళ్లి, కొందరు ప్రతినిధులను కలువడం, ఫొ టోలు దిగడం, కొన్ని ఒప్పందాలు చేసుకోవడం మాత్రమే పర్యటన విజయానికి ప్రమాణం కాదు. తెలంగాణ రైజింగ్ పేరుతో అమెరికాలో పెట్టుబడులు, పరిశ్రమలు, టెక్ సంస్థలను తెలంగాణకు ఆహ్వానించడమే ప్రధాన లక్ష్యమైతే, గత విదేశీ పర్యటనల ఫలితాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలి. దావోస్ వంటి అంతర్జాతీయ వేదికల్లో భారీ పెట్టుబడుల ప్రకటనలు, ఎంవోయూలు కుదుర్చుకోవడం సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. కానీ వాటిలో ఎన్ని వాస్తవ పెట్టుబడులుగా మారాయి? ఎన్ని పరిశ్రమలు క్షేత్రస్థాయిలో ఏర్పడ్డాయి? ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు ఉండా లి. ఎంవోయూ కుదరడం విజయానికి మొదటి అడుగు మాత్రమే. అది పరిశ్రమగా, పెట్టుబడిగా, ఉద్యోగంగా మారినప్పుడే ప్రభుత్వ పర్యటనకు నిజమైన ఫలితం వచ్చినట్టు భావించాలి. రేవంత్‌రెడ్డి లండన్ పర్యటన కూడా ఇదే కోణంలో పరిశీలించాల్సిన అంశం. ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో తెలంగాణకు విద్య, పరిశోధన భాగస్వామ్యాలు ఏర్పడాలని కోరుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. విదేశీ విశ్వవిద్యాలయాలు రాష్ట్రానికి రావడం, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఏర్పాటు కావడం విద్యార్థులకు ఉపయోగకరమని తెలిపింది. అయితే అదే సమయంలో తెలంగాణలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితిని కూడా ప్రభుత్వం సమీక్షించాలి. అధ్యాపకుల ఖాళీలు, పరిశోధన నిధులు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, మౌలిక వసతులు వంటి సమస్యలపై విద్యార్థులు ఆందోళన చెందుతుంటే, ముందుగా మన విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రకటించిన నిధుల పరిస్థితి ఏమిటి? జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలకు అవసరమైన నిధులు ఎందుకు అందడం లేదు? ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుల నియామకాలు, పరిశోధనలకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తున్నది? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం మాత్రమే విద్యా సంస్కరణగా భావించలేం. విదేశీ సంస్థలు రావాలి, అదే సమయంలో తెలంగాణ విద్యాసంస్థలను కూడా ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలి. ఈ వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అమెరికా పర్యటన కూడా ప్రస్తావనకు వస్తున్నది. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు కొన్ని రోజుల ముందు ఉప ముఖ్యమంత్రి దాదాపు రెండు వారాలు అమెరికాలో పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, పారిశ్రామికవేత్తలను కలువడం ప్రభుత్వ లక్ష్యమైతే, ఆ పర్యటనలోనే తెలంగాణ రైజింగ్ కోసం పెట్టుబడులను ఎందుకు సమీకరించలేదనే ప్రశ్న తలెత్తుతున్నది. ఇద్దరు ముఖ్య నాయకుల పర్యటనల మధ్య సమన్వయం ఎందుకు లేదు? ఎవరి బాధ్యత ఏమిటి? ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. దీనిని వ్యక్తిగత ప్రతిష్ట సమస్యగా కాకుండా పరిపాలనా సమన్వయ సమస్యగా చూడాలి. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనల విషయంలో ప్రచారానికి, ఫలితానికి మధ్య తేడా ఉన్నది. పర్యటనకు ముందు భారీ పెట్టుబడుల ప్రకటనలు రావడం కంటే, పర్యటన తర్వాత వాటి అమలుపై ప్రజలకు నివేదిక ఇవ్వడం ముఖ్యం. సంస్థ పేరు, పెట్టుబడి మొత్తం, స్థాపించే ప్రదేశం, అమలు దశ, ఉద్యోగాల సంఖ్య వంటి వివరాలను ప్రభుత్వం ప్రజలకు అందించాలి. అప్పుడే తెలంగాణ రైజింగ్ ఎంతవరకు వాస్తవమో తెలుస్తుంది. రాష్ట్ర కాంగ్రెస్‌లోని అంతర్గత అసంతృప్తి నెలకొన్నది. మంత్రులు-ఎమ్మెల్యేల మధ్య మాట ల యుద్ధం ముదురుతున్నది. ప్రభుత్వ సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వం లో సమన్వయం, సహకారం బలహీనంగా ఉన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి విదేశీ పర్యటన వ్యవహారం ఆ విమర్శలకు మరింత బలం చేకూర్చింది. మొత్తానికి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం కేవలం రాజకీయ వివాదం కాదు. పాలనా ప్రణాళిక, పారదర్శకత, పెట్టుబడుల ఫలితాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు అనే నాలుగు కోణాల్లో చూడాల్సిన అంశం. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పర్యటన ప్రణాళికలోనే లోపాలున్నాయా? అనే ప్రశ్నకు పూర్తి సమాధానం, రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించాలి.దమరోవైపు కేంద్ర ప్రభుత్వ వర్గాల విశ్వసనీయ సమాచారం జాతీయ మీడియా పలు కథనాలు ఇస్తున్నది. రేవంత్ పర్యటన షెడ్యూల్‌లో న్యూయార్క్ మేయర్ జోరాన్ మమ్దానీతో భేటీ ఉన్నట్టు తెలుస్తున్నది. ఆయన గతంలో పీఎం మోదీకి వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డి పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించినట్టు కథనాలు వస్తున్నాయి.



# హెజీలో ప్రైవేట్ లేబరేటరీ సీజ్

- ఆపరేషన్ కండిషన్‌లోకి వచ్చే వరకు కార్యకలాపాలు నిలిపివేత..
- బాధితులకు సరైన న్యాయం, నష్టపరిహారం అందేలా చర్యలు: అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు
- రియాక్టర్ పేలుడులో ఇద్దరు మృతి.. 10 మందికిపైగా తీవ్ర గాయాలు
- బాధితులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెంలోని హెజీలో లేబొరేటరీస్ ప్రైవేట్ కెమికల్ కంపెనీలో శుక్రవారం రాత్రి జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనపై అధికారులు చర్యలు చేపట్టారు. కంపెనీ కార్యకలాపాలను ఆపరేషన్ కండిషన్‌లోకి వచ్చే వరకు సీజ్ చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో మృతుల సంఖ్య ఇద్దరికి చేరగా, 10 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, పీసీబీ ఈఈ వెంకన్న, జిల్లా లేబర్ ఈఈ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ యాజమాన్యాన్ని, అధికారులను అడిగి తెలుసుకున్నారు. రియాక్టర్ పేలిన ప్రదేశాన్ని పరిశీలించి ప్రమాద తీవ్రతపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో షిఫ్ట్ మారే సమయంలో రియాక్టర్‌కు సంబంధించిన సాంకేతిక లోపం తలెత్తడంతో పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధితులకు సరైన నష్టపరిహారం అందించే విషయమై కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. కంపెనీని ఆపరేషన్ కండిషన్‌లోకి వచ్చే వరకు సీజ్ చేస్తున్నామని, తదుపరి చర్యలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

**ఇద్దరు కార్మికులు మృతి:**

ప్రమాదంలో నల్లగొండ జిల్లా పెద్దపూర్ మండలం చిన్నపురం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి (31), ఖమ్మం జిల్లా చోడవరం మండలానికి చెందిన నాగబోయిన నరేష్‌కుమార్ (29) మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

**గాయపడిన వారికి చికిత్స:**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన ధనబోతు రాజశేఖర్, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వెంకటాపురానికి చెందిన పదుల చెన్నకేశవులు, ఏపీ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలుపాడు గ్రామానికి చెందిన మేద శ్రీహరి ఉన్నారు. ఇతర గాయపడిన వారిలో హైదరాబాద్ ఛత్రినాకకు చెందిన చిన్నారెడ్డి శివకుమార్‌రెడ్డి, గుంటూరు జిల్లా కోసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన మారెళ్ల యోహాను, కర్నూలు జిల్లా అచ్చంపేట హనుమాన్‌నగర్‌కు చెందిన ఏసుదాసు, నల్లగొండ జిల్లా చిట్యాల మండలం సుంకనపల్లి గ్రామానికి చెందిన దూడల శివశంకర్, విజయనగరం నూకలవాడకు చెందిన సాకేటి గణేష్, చౌటుప్పల్ హనుమాన్‌నగర్‌కు చెందిన పెంట్యాల రవి ఉన్నారు. వీరికి హైదరాబాద్‌లోని యశోద, గాంధీ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**బాధితులకు న్యాయం చేయాలని ధర్నా:**

ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు కంపెనీ వద్ద ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, పీసీబీ ఈఈ వెంకన్న, జిల్లా లేబర్ ఈఈ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, డీసీపీ మధుసూదన్ రెడ్డి, సీఐ లు, ఎస్ఐ లు, పోలీసు సిబ్బంది, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మృతుడు నరేష్ (ఫైల్)



మృతుడు నాగిరెడ్డి (ఫైల్)

# బ్రెజిల్‌పై అమెరికా పడగ!



లాటిన్ అమెరికా దేశాల్లో నియంతలను గద్దెనెక్కించిన గతకాలపు పోకడలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. వచ్చే అక్టోబర్ మొదటివారం బ్రెజిల్‌లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత దేశాధ్యక్షుడు, మధ్యేవాద వామపక్ష నేత లూలా డి సిల్వాను ఓడించి మితవాద పక్ష నాయకుడు ఫ్లేవియో బోల్సోనారో అధికారంలోకి రాలేనట్టయితే సైనిక జోక్యం చేసుకోవటానికి పథక రచన చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు నేరస్త ముఠాలు సీవీ, పీసీసీలను ఉగ్రవాద సంస్థలుగా అమెరికా ప్రకటించింది. వీరినుంచి అమెరికాకు ఏర్పడిన ముప్పును తొలగించటంలో బ్రెజిల్ విఫలమైందన్న సాకుతో సైనిక దాడి చేయటమే ఈ పథకం ఆంతర్యం. వెనిజులాలో సైతం నిరుడు ట్రంప్ ఇదే తరహా డ్రామా నడిపించారు. మాదకద్రవ్య ముఠాలు అమెరికా భద్రతకు ముప్పుగా మారాయనీ, వాటిని అధ్యక్షుడు మదురో ప్రోత్సహిస్తున్నారనీ ఆరోపించారు. ఈ ఏడాది జనవరిలో మదురో దంపతుల్ని కిడ్నాప్ చేసి అమెరికాకు తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ అమెరికా కోర్టులో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. లాటిన్ అమెరికా దేశాలన్నిటా 1964 మొదలుకొని రెండు దశాబ్దాలపాటు అమెరికా ఇలాంటి దుర్మార్గాలకే పాల్పడింది. ఇదే బ్రెజిల్‌లో 1964లో వామపక్ష ప్రభుత్వాధినేత జివావో గౌలార్ట్‌ను సైనిక కుట్రలో తొలగించి హుంబెర్టో కాస్టిలోను గద్దెనెక్కించింది. అదే సంవత్సరం బొలీవియాపై సైతం ఇదే కుట్ర కొనసాగించింది. చిలీలో 1973లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సోషలిస్టు నాయకుడు సాల్వెడార్ అలెండీని సైనిక తిరుగుబాటులో హతమార్చి అగస్టో పినోచెట్‌ను అధినేతగా కూర్చోబెట్టింది. ఇలా ఉరుగ్వే, అర్జెంటీనా, ఎల్ సాల్వెడార్, గ్వాటెమాలా దేశాల్లో సైతం 1985 వరకూ ఈ కుట్రలు సాగుతూనే వచ్చాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో తన పొరుగున ఆనాటి సోవియట్ ప్రభావం పడితే తన ప్రాభవం కొడిగడుతుందన్న భయాందోళనలే ఈ కుట్రలకు కారణం. నియంతల రాకతో లాటిన్ అమెరికా దేశాల ప్రజానీకం భయానక పాలన చవిచూశారు. ఒక్క అర్జెంటీనాలోనే 'డర్టీ వార్' పేరుతో పదివేలమంది ప్రాణాలు తీశారు. చిలీలో, ఎల్‌సాల్వెడార్‌లో, గ్వాటెమాలాలో సాగించిన నరమేధాలు దాదాపు యాభైవేలమంది ఉసురుతీశాయి. మళ్లీ ఇన్నాళ్లకు అమెరికా అస్తిత్వ ఆందోళనలో పడింది. మొన్న మే నెలలో జరిగిన కొలంబియా ఎన్నికల్లో ట్రంప్ తెరవెనక సాగించిన కుట్రల ఫలితంగా ఆయన అనుకూలుడు ఎబెలార్డో ఎస్ప్రియెల్లా స్వల్ప ఆధిక్యతతో అధికారంలోకొచ్చారు. అందుకే బ్రెజిల్‌లో సైతం ఆ పాచిక పారుతుందనుకుంటున్నారు. లూలా బ్రిక్స్ కూటమిలో చురుగ్గా పాలుపంచుకోవటం, చైనాతో సాన్నిహిత్యం పెంచుకోవటం, అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవటం ట్రంప్‌కు కంటగింపుగా మారాయి. తన కీలుబొమ్మ జైర్ బోల్సొనారో 2023 ఎన్నికల్లో పదవీభ్రష్టుడు కావటంనుంచే ట్రంప్ బుసలుకొడుతున్నారు. తిరుగుబాటు కుట్రలో బోల్సొనారోను శిక్షిస్తే తీవ్ర పరిణామాలుంటాయని న్యాయవ్యవస్థను సైతం హెచ్చరించారు. కానీ ఈ ఏడాది మొదట్లో బోల్సొనారోకు 27 యేళ్ల ఖైదు పడింది. ప్రస్తుతం డి సిల్వాతో తలపడేందుకు రంగంలో 13 మంది అభ్యర్థులున్నారు. ఆయనకు 40 శాతం మద్దతుంటే, సమీప ప్రత్యర్థి ఫ్లేవియో 28 శాతంవద్ద ఆగిపోయారు. దీన్నెలాగైనా తారుమారు చేయటానికి అమెరికా పడరాని పాట్లు పడుతోంది. బ్రెజిల్ పాత్రికేయులకూ, వివిధ మాధ్యమాల్లో ప్రభావం చూపగల వారికీ ఉదారంగా వీసాలు మంజూరుచేసి 'భావప్రకటనా స్వేచ్ఛ'పై పాఠాలు చెబుతోంది. తప్పుడు ప్రచారాలు సాగిస్తోంది. అయినా పరిస్థితి ఆశాజనకంగా లేకపోవటంతో కొత్త ఎత్తుకు తెరలేపింది. ఇరాన్‌లో ఓటమి ఎదురుకావటం, ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినటం, డాలర్ మనుగడకు ముప్పు ఏర్పడటం ట్రంప్‌ను వేధిస్తున్నాయి. ఇప్పటికే పెరూ, ఎల్‌సాల్వెడార్ దేశాల్లో మితవాదులు గెలిచారు. బ్రెజిల్‌ను సైతం లోబరుచుకోగలిగితే దేశంలో తన కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయని ట్రంప్ భావిస్తున్నారు. పొరుగు దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటంలాంటి అనాగరిక పోకడలకు అమెరికా ఇకనైనా స్వస్తిచెప్పాలి.




## బెస్ట్ రీఛార్జ్ ఏది? జియో, ఎయిర్‌టెల్ ప్లాన్స్ ఇవే!

స్మార్ట్‌ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ.. మంచి స్పీడ్‌తో పాటు తక్కువ ధరలో, ఎక్కువ డేటా, ఎక్కువ వ్యాలిడిటీ ఇచ్చే రీఛార్జ్ ప్లాన్ కోసం చూస్తుంటారు. భారత్‌లో 5జీ సేవలు అందిస్తున్న ప్రధాన టెలికాం కంపెనీల్లో రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ ముందున్నాయి. అయితే జియోలో రూ.198 ప్లాన్, ఎయిర్‌టెల్‌లో రూ.349 ప్లాన్ తీసుకుంటే ఏది ఎక్కువ బెనిఫిట్స్ ఇస్తుంది?, రెండింటి మధ్య అసలు తేడా ఏంటి? ఇప్పుడు చూద్దాం.

**జియో రూ.198 ప్లాన్**

తక్కువ బడ్జెట్‌లో 5జీ కావాలనుకునే వారికి జియో రూ.198 ప్లాన్ బాగుంటుంది. ఈ ప్లాన్ 14 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఈ రీఛార్జ్‌తో రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్ లభిస్తాయి. ఎక్కువగా వీడియోలు చూసేవారు, సోషల్ మీడియా ఉపయోగించేవారు, భారీ ఫైళ్లను డౌన్‌లోడ్ చేసేవారికి ఈ ప్లాన్ ఉపయోగపడుతుంది. అదనంగా.. జియో టీవీ, జియోఏఐక్లౌడ్ వంటి ప్రయోజనాలు కూడా ఈ ప్లాన్‌లో ఉన్నాయి.

**ఎయిర్‌టెల్ రూ.349 ప్లాన్**

ఎయిర్‌టెల్ రూ.349 ప్లాన్ ధర జిఓ కంటే ఎక్కువే, అయితే ఇందులో వ్యాలిడిటీ 28 రోజులు లభిస్తుంది. ఇందులో రోజుకు 1.5జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ కాలింగ్ లభిస్తాయి. అదనపు బెనిఫిట్స్ విషయానికి వస్తే.. 12 నెలల పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. అలాగే యాపిల్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్ కూడా ఈ ప్లాన్‌లో భాగంగా అందుతోంది.

**జియో, ఎయిర్‌టెల్ మధ్య తేడా!**

రెండు ప్లాన్లను పరిశీలిస్తే.. ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. జియో రూ.198 ప్లాన్ చౌకగా ఉండటంతో పాటు రోజువారీ డేటా కూడా ఎక్కువగా ఇస్తుంది. కానీ దీని వ్యాలిడిటీ కేవలం 14 రోజులు. అదే.. ఎయిర్‌టెల్ రూ.349 ప్లాన్‌కు 28 రోజుల వ్యాలిడిటీ ఉంది. అంటే జియో ప్లాన్‌తో పోలిస్తే రెట్టింపు కాలం రీఛార్జ్ గురించి ఆలోచించాల్సిన అవసరం ఉండదు. అయితే రోజువారీ డేటా 1.5+దీ మాత్రమే.

## రూ. 4,896 కోట్ల ఎఫ్‌డీఐలు..

న్యూఢిల్లీ: ఆటోమాటిక్ మార్గంలో లభించిన 29 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐలు) సమాచారం అందినట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. వీటి విలువ రూ. 4,896 కోట్లుకాగా.. మే నెలలో ప్రభుత్వం చైనాకు వాటాగల ఎఫ్‌డీఐలపై మార్గదర్శకాలను సవరించింది. తద్వారా చైనా కంపెనీలకు 10 శాతంలోపు వాటాగల విదేశీ సంస్థలు ఆటోమాటిక్ మార్గంలో దేశీయంగా ఇన్వెస్ట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. వెరసి మే 1 నుంచి 2026 ఆగస్ట్ 20కల్లా 29 ప్రతిపాదనల వివరాలు దాఖలైనట్లు వాణిజ్యం, పరిశ్రమల శాఖ తెలియజేసింది. ఐటీ, ఏఐ, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, తయారీ, ఫార్మాస్యూటికల్స్, డేటా సెంటర్లు, రవాణా సర?వసులలో తాజా పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. పెట్టుబడులు మారిషస్, యూఎస్, కొరియా, జపాన్, సింగపూర్, లక్సెమ్‌బర్గ్, కేమన్ ఐలాండ్స్ నుంచి లభించినట్లు పేర్కొంది. మే నెలకంటే ముందు భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాల కంపెనీలకు వాటా కలిగిన విదేశీ సంస్థలు ఏ రంగంలోనైనా పెట్టుబడులు చేపట్టేందుకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవలసి ఉండేది. మేలో చేపట్టిన మార్గదర్శకాల సవరణల తదుపరి ఆటోమాటిక్ మార్గంలో పెట్టుబడులకు అనుమతి లభిస్తోంది. అయితే ప్రభుత్వానికి రిపోర్ట్ చేయవలసి ఉంటుంది.



# వైద్య వ్యాపారం భళా..



న్యూఢిల్లీ, ఆగస్టు 22: కూడు.. గూడు.. గుడ్డ.. ఆ తర్వాత ఈ దేశంలోని కోట్లాది ప్రజల కల ఆరోగ్య సంరక్షణే. ఇదే.. ఇప్పుడు భారతీయ వైద్య రంగాన్ని వేగంగా వృద్ధిపథంలో నడిపిస్తున్నది. ఇక ఆపత్కాలంలో వైద్యం చేయడమే కాదు.. అవసరమైతే ఆంత్రప్రెన్యూర్లుగానూ మారుతామని డాక్టర్లు నిరూపిస్తున్నారు. దీంతో హెల్త్‌కేర్ బిజినెస్ దూసుకుపోతున్నది. అందరికీ ఆరోగ్య బీమా అందుబాటులోకి రావడం కూడా.. ప్రైవేట్ ఆస్పత్రుల విస్తరణకు దోహదం చేస్తున్నది. దేశంలో 60 కోట్లకుపైగా జనాభాకు ఆరోగ్య బీమా ఉన్నట్టు అంచనా. మణిపాల్, అపోలో దగ్గర్నుంచి మ్యాక్స్ హెల్త్‌కేర్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, మేదాంత, పరాస్ హెల్త్, యశోదా హాస్పిటల్స్ వరకు దేశంలోని అన్ని ప్రధాన దవాఖానల గ్రూపులు.. పడకలను పెంచుకుంటూ, కొత్త మార్కెట్లలోకి ప్రవేశిస్తూపోతున్నాయి. ఈ క్రమంలోనే దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడమేగాక, స్టాక్ మార్కెట్ల నుంచీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) ద్వారా పెద్ద ఎత్తున నిధులను సమీకరిస్తున్నాయి. పడకల సామర్థ్యం ప్రకారం దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ హాస్పిటల్ నెట్‌వర్క్ అయిన మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్.. జూలైలో రూ.9,275 కోట్ల ఐపీవోను తెచ్చింది. దేశ, విదేశాల్లో దవాఖానల కొనుగోలుకు చేసిన అప్పులను తీర్చేందుకు ఈ నిధులను వినియోగిస్తామని మణిపాల్ చెప్తున్నది. అలాగే అపోలో హాస్పిటల్స్ వచ్చే ఐదేండ్లలో దాదాపు 4,400 బెడ్లను పెంచుకోవాలని చూస్తున్నది. మరోవైపు ఢిల్లీ, ముంబై, గువాహటి, వారణాసి నగరాల్లో విస్తరించి, 2,950 బెడ్లను పెంచుకోవాలని మేదాంత యోచిస్తున్నది. ఇదే క్రమంలో వచ్చే 3-4 ఏండ్లలో గురుగ్రామ్, లక్నో, ఢిల్లీ, పంజాబ్, భువనేశ్వర్ ప్రాజెక్టుల ద్వారా మ్యాక్స్ హెల్త్‌కేర్ తమ పడకల సామర్థ్యాన్ని 10వేలకుపైగా పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఇక గ్రేటర్ నోయిడాలోని యశోదా మెడిసిటీలో యశోదా గ్రూప్ రూ.2,400 కోట్లను పెట్టుబడిగా పెడుతున్నది. ఫోర్టిస్, పారస్.. ఇలా అనేక ప్రముఖ గ్రూపులు దేశవ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికల్ని రచిస్తున్నాయి. భారతీయ హాస్పిటల్ బూమ్ కేవలం పెట్టుబడుల ద్వారానే రాలేదు. దీని వెనుక దేశంలోని అతిపెద్ద హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూషన్ల పెద్దలున్నారు. డాక్టర్లుగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టి.. ఇప్పుడు విజయవంతమైన దవాఖానల నిర్వాహకులుగా పేరుగాంచారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి (అపోలో హాస్పిటల్స్), డాక్టర్ నరేశ్ ట్రెహాన్ (మేదాంత), డాక్టర్ దేవీ శెట్టి (నారాయణ హెల్త్).. ఇలా ఎందరో ఉన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ దూసుకెళ్తున్నారు. ఈ వరుసలో హైదరాబాద్ ఆధారిత, రెండు తెలుగు రాష్ర్టాలకు చెందినవారు ఒక అడుగు ముందే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. దేశంలోని ఫార్మా కంపెనీల్లో ఎక్కువగా ఇక్కడే ఉండటం కూడా కలిసొస్తున్న అంశంగా ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. హాస్పిటల్స్ విస్తరణతో వైద్యులు, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతరత్రా మెడికల్ సిబ్బందికి ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయని అంటున్నాయి.

SBI

## ఎస్బీఐ బీఎస్‌బీడీ ఖాతాదారులకు షాక్

**అక్టోబర్ 1 నుంచి నగదు ఉపసంహరణలపై చార్జీలు**

ముంబై, ఆగస్టు 20: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ.. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాదారుల నగదు ఉపసంహరణ చార్జీలను సవరించబోతున్నది. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పుల ప్రకారం.. ఖాతాదారులు మొత్తంగా నెలకు నాలుగు నగదు ఉపసంహరణలనే ఉచితంగా పొందగలరు. ఆపై ప్రతి నగదు ఉపసంహరణకూ రూ.15 చొప్పున (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి ఉంటుంది. కాగా, బీఎస్‌బీడీ ఖాతాదారులు తమ ఖాతాల్లో ఎటువంటి కనీస నగదు నిల్వలను ఉంచనక్కర్లేదన్న విషయం తెలిసిందే. సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లను పోల్చడం డిపాజిట్లు, ఉపసంహరణలు సహా కనీస బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ బీఎస్‌బీడీ ఖాతాలను బ్యాంకులు అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే రెగ్యులర్ సేవింగ్స్ అకౌంట్‌కు వీటికి సేవలు, లావాదేవీలు పరిమితుల్లో తేడాలుంటాయి.

## బంగారానికి ఏమైంది? ఒక్కరోజే ఇంత జంప్ ఎందుకు?




బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్లో గురువారం (ఆగస్టు 20) 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు ఏకంగా రూ.4,300 పెరిగి రూ.1,59,270కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.3,950 పెరిగి రూ.1,46,000 పలికింది.అంటే ఒక్కరోజులోనే 24 క్యారెట్ల బంగారం దాదాపు 2.8 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరల్లో ఇటీవల చోటుచేసుకున్న భారీ కదలికలు దేశీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపుతున్నాయి. అమెరికా డాలర్ విలువ, ట్రెజరీ బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు, ఫెడ్ వడ్డీ రేట్లపై అంచనాలు వంటి అంశాలు పసిడి ధరలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. తాజాగా అమెరికా ట్రెజరీ దీర్ఘకాలిక బాండ్ల బైబ్యాక్‌ను పెంచుతుందన్న వార్తల నేపథ్యంలో డాలర్, బాండ్ ఈల్డ్స్ బలహీనపడటంతో అంతర్జాతీయంగా బంగారం ధర ఒక్క సెషన్‌లో 4 శాతానికి పైగా ఎగిసింది. దీనికి తోడు అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు, రష్యా--ఉక్రెయిన్ పరిణామాలు వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కూడా పెట్టుబడిదారులను బంగారం వైపు మళ్లిస్తున్నాయి. అనిశ్చితి పెరిగినప్పుడు సురక్షిత పెట్టుబడి సాధనంగా పరిగణించే బంగారానికి డిమాండ్ పెరగడం సహజం.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు.. రెండు వారాల్లో అమలు చేస్తారా..?

చాలా రోజులుగా ప్రచారం జరుగుతున్నట్లు యూపీఐ లావాదేవీలపై త్వరలోనే ఛార్జీలు అమలు కాబోతున్నాయి. అవి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)కు సంబంధించిన ఛార్జీలు. ఈ విధానం రెండు వారాల్లోగా అమలులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి వారంలోపే అధికారిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని ఆర్థిక వ్యవహారాల శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ విషయంలో యూపీఐ వినియోగదారులు కంగారు పడాల్సిన అవసరం లేదు. ఈ విధానం అమలైతే వారిపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ఇది ఎండీఆర్. అంటే, వ్యాపారస్తులపై మాత్రమే ఛార్జీలు విధిస్తారు. రూ.2,000 లేదా అంతకంటే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీలపై మాత్రమే విధించే ఛార్జి ఇది. అది కూడా 0.3 శాతం. డిజిటల్ పేమెంట్ స్వీకరించే వ్యాపారులే దీన్ని చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఇతర ఎలక్ట్రానిక్ పేమెంట్లపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ఎండీఆర్ అంటే ప్రతి లావాదేవీపై వ్యాపారులు బ్యాంకులకు లేదా సర్వీస్ ప్రొవైడర్లకు చెల్లించే ఫీజు. ఈ




విధానం గతంలో అమలులో ఉండేది. కానీ, యూపీఐ, డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రం 2020లో ఎండీఆర్‌ను రద్దు చేసింది. మరో వారంలో దీనిపై గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఒకసారి నోటిఫికేషన్ వచ్చిన తర్వాత యూపీఐ అండ్ సర్వీస్ స్టీరింగ్ కమిటీ అయిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తగిన విధి విధానాలు ఖరారు చేస్తుంది. ఎండీఆర్ అమలును వ్యాపారస్తులు వ్యతిరేకిస్తుంటే, బ్యాంకర్లు సమర్థిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో మొత్తం డిజిటల్ లావాదేవీలలో 85 శాతం ట్రాన్సాక్షన్స్ యూపీఐ ద్వారానే జరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.314.23 లక్షల కోట్ల విలువైన 241.62 బిలియన్ ట్రాన్సాక్షన్స్ జరిగాయి. ఇలా భారీ స్థాయిలో జరిగే చెల్లింపుల కోసం సర్వర్లు, నెట్‌వర్క్ సెక్యూరిటీ వంటి అంశాల నిర్వహణ బ్యాంకులకు తలకుమించిన భారంగా మారింది. వాటికి ఆర్థిక భారం అవుతోంది. అందుకే, ఈ భారం తగ్గాలంటే ఎండీఆర్ అమలు చేయాలని బ్యాంకులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి.



# బన్నీ స్టైల్ కాపీ కొట్టా

'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళీ బ్యూటీ మమిత బైజూ. వరుస అవకాశాలు అందుకుంటూ సక్సెస్ రేస్‌లో దూసుకుపోతున్నది. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌ని ఫిదా చేసిన ఈ అమ్మడు నటించిన డ్యూడ్, జననాయగన్ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో నటించింది. ఈ సందర్భంగా అమ్మకుట్టి పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి... మాది కేరళంలోని కొట్టాయం. నాన్న డాక్టర్. అన్నయ్య రాష్ట్రస్థాయి క్రికెటర్. నా జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలన్నీ మా అన్నయ్యే తీసుకుంటాడు. నాకొచ్చే లవ్ ప్రపోజల్స్‌ను డీల్ చేయడంతో పాటు నాకొచ్చే పెండ్లి సంబంధాల్లోనూ ఆయన నిర్ణయమే ఫైనల్. నా తొలి సినిమా 'సర్వోపరి పాలక్కారన్' అయినా, నాకంటూ గుర్తింపు తెచ్చింది మాత్రం ప్రేమలు చిత్రమే. దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో పాటు నా కెరీర్‌ని మలుపు తిప్పిన సినిమా ఇది. మలయాళి సినిమానే అయినా ఎక్కువ భాగం షూటింగ్ హైదరాబాద్‌లోనే చిత్రీకరించారు. అందుకే తెలుగు ప్రేక్షకులు దీన్ని ఎంతో ఆదరించారు. నేను అల్లు అర్జున్‌కు పెద్ద ఫ్యాన్‌ని. ఆయన నటించిన ఇద్దరమ్మాయిలు సినిమా అంటే నాకెంతో ఇష్టం. ఆ సినిమాలో బన్నీ ఉపయోగించిన వాచ్, ధరించిన టీషర్ట్స్, ఆయన హైస్టైల్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయన మీదున్న అభిమానంతో ఆ హైస్టైల్‌ను కాపీ చేస్తుంటాను. ఇక కర సినిమా కోసం ధనుష్ ఎంతో కష్టపడ్డాడు. స్టార్ హీరో సూర్యతో కలిసి ప్రధాన పాత్రలో నటించడం గొప్ప అవకాశంగా భావిస్తాను. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం ఎక్కువైపోయింది. సెలెబ్రిటీ అనే కారణంతో నేను అడపాదడపాగా సోషల్‌మీడియాలో ఉండేదాన్ని. ప్రస్తుతం సోషల్‌మీడియాతో వచ్చే పబ్లిసిటీ కంటే మానసిక ప్రశాంతతకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. అది ఆచరణలో పెడుతున్నాను కూడా. ఇక నా సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు మా పీఆర్ టీమ్ అందిస్తారు. ఒక్క సినిమా వెనుక ఎంతోమంది కష్టం దాగుంటుంది. అది ఎప్పుడూ వృథా కాకూడదన్నది నా భావన. జన నాయగన్ లీకైన విషయం తొలుత నమ్మలేదు.



# మహేంద్రగిరి తాలూకు మిస్టరీ

'ఇదొక డివోషనల్ థ్రిల్లర్. 'కాంతార' 'కార్తికేయ' 'విరూపాక్ష' జాబితాలో చేరుతుందనే నమ్మకం ఉంది. ఇందులో నా పర్‌ఫార్మెన్స్ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది' అన్నారు హీరో సుమంత్. ఆయన ఐశ్వర్యరాజేష్‌తో కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. సంతోష్ జాగర్లపూడి దర్శకుడు. కలిపు మధు, లక్ష్మణ్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి 'వాట్ ఏ లాజిక్ సర్‌జీ' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. స్పిరిచ్యుయెల్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఆద్యంతం అనూహ్య మలుపులతో సాగుతుందని దర్శకుడు తెలిపారు. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా ఇదని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, దర్శకత్వం: సంతోష్ జాగర్లపూడి.



# మెక్సికోలో వారణాసి సందడి

## భారతీయ పురాణగాథలకు యాక్షన్ మేళవింపు
## రాజమౌళి వీడియో వైరల్

భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటున్న భారీ బ్జడెట్ చిత్రం 'వారణాసి'. ఈ చిత్రం తాజాగా మెక్సికో సిటీలో జరుగుతున్న అతిపెద్ద పాప్ కల్చర్ ఫెస్టివల్ లో సందడి చేసింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ప్రదర్శించిన ఫస్ట్ గ్లింప్స్ చూసి అంతర్జాతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి స్వయంగా హాజరు కాలేకపోయినప్పటికీ, ఆయన పంపిన ప్రత్యేక వీడియో సందేశం ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. మెక్సికో అభిమానులందరికీ నమస్కారం! 'వారణాసి' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అద్భుతమైన సాహసయాత్ర. భారతీయ పురాణ గాథలను , ప్రపంచస్థాయి యాక్షన్‌తో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అని రాజమౌళి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేశ్ బాబును రాజమౌళి చూపిస్తున్న విధానంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని ఒక కొత్త మహేశ్‌ను ఈ సినిమాలో చూస్తారు అని జక్కన్న భరోసా ఇవ్వడం గమనార్హం. గ్లింప్స్‌లో మహేశ్ బాబు పొడవాటి జుట్టు, రఫ్ గడ్డంతో చాలా కరుకుగా కనిపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అక్కడి ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. దాదాపు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న 'వారణాసి' మూవీ ఇప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ ప్రాజెక్ట్‌గా నిలిచింది. ఈ సినిమా గురించి వచ్చే చిన్న వార్త అయినా సోషల్ మీడియాను ఊపేస్తోంది.



# 15 ఏళ్ల తర్వాత సమీరా రెడ్డి రీఎంట్రీ.. బిగ్ మూవీలో ఛాన్స్

బాలీవుడ్ నటి సమీరా రెడ్డి సుమారు 15 ఏళ్ల తర్వాత రీఎంట్రీ ఇస్తుంది. 2014లో వ్యాపారవేత్త అక్షయ్ వర్దేను వివాహం చేసుకున్న సమీరా.. అంతకు ముందే సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. కృష్ణం వందే జగద్గురుం (2012) మూవీలో ప్రత్యేక గీతంలో మాత్రమే ఆమె కనిపించారు. అయితే, ఇప్పుడు సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఆఖ్రీ సవాల్'లో కీలక పాత్రలో ఆమె నటిస్తుంది. ఈ చిత్రం మే 8న విడుదల కానుంది. ఆఖ్రీ సవాల్ మూవీలో సమీరా రెడ్డి పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. తన రీఎంట్రీ గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తను నటించబోయే పాత్రల ఎంపిక విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటున్నానని సమీరా వెల్లడించింది. రొటీన్ కమర్షియల్ పాత్రల కంటే, నటనకు ఆస్కారం కల్పించే అర్థవంతమైన పాత్రలపైనే తన దృష్టి ఉంటుందని ఆమె నొక్కి చెప్పింది. ఆఖ్రీ సవాల్ చిత్రాన్ని జాతీయ అవార్డు దర్శకుడు అభిజీత్ మోహన్ వారంగ్ తెరకెక్కిస్తున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ప్రయాణాన్ని కథగా రాసుకుని ఈ మూవీని తీసినట్లు సమాచారం. ఇందులో సంజయ్ దత్ ప్రొఫెసర్ గోపాల్ నాదకర్ణిగా ఒక కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి కుమారుడు నమాశి చక్రవర్తి పీహెచ్‌డీ విద్యార్థి పాత్రలో కనిపించబోతున్నాడు.

# ఇది సత్యం మాట.. ఇంకా డౌటా!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 158వ చిత్రానికి 'కాకా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బాబీ కొల్లి దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకానుంది. శనివారం చిరంజీవి జన్మదినం సందర్భంగా టైటిల్ ప్రకటనతో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆక్వా ఇండస్ట్రీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసే సత్యం పాత్రలో కనిపించారు చిరంజీవి. రెండు విభిన్నమైన లుక్స్‌తో ఆయన ఆకట్టుకున్నారు. 'ఇది సత్యం మాట..ఇంకా డౌటా' అంటూ చిరు చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సంభాషణలు: భాను-నందు, రచన-దర్శకత్వం: బాబీ కొల్లి.

**'విశ్వంభర' స్పెషల్ పోస్టర్**

మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని 'విశ్వంభర' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో చిరంజీవి ఫెరోషియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. దైవత్వం, వీరత్వం కూడిన ప్రపంచాన్ని పోస్టర్ ప్రజెంట్ చేస్తున్నది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫాంటసీ చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. కీరవాణి స్వరకర్త.






# టాక్సిక్‌లో యాక్షన్ సన్నివేశాలు అదుర్స్

## దర్శకురాలు గీతూమోహన్ ప్రతిభ అద్భుతం అన్న యశ్

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఈ సినిమా టీజర్ విడుదలైన నాటి నుంచి చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. 'టాక్సిక్'లోని సన్నివేశాల గురించి యశ్ ఇటీవల సినిమాకాన్ వేడుకలో మాట్లాడారు. ఈ యాక్షన్ చిత్రాన్ని ఒక మహిళా దర్శకురాలు తెరకెక్కిస్తు న్నందువల్ల సరికొత్తగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌పై ప్రశంసలు కురిపించారు. 'సాధారణంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాలు అంటే పురుష దర్శకులే బాగా చేస్తారనే భావన చాలామందిలో ఉంటుంది. కానీ, ఈ గ్యాంగ్‌స్టర్ కథను ఒక మహిళా కోణంలో చూపించడం అనేది చాలా కొత్తగా ఉంటుంది. ఇందులోని శృంగార సన్నివేశాల నుంచి యాక్షన్ సీన్స్ వరకు ప్రతి దానిలోనూ ఆమె ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. సున్నితమైన భావాలను ఎంత హృద్యంగా చూపించారో.. యాక్షన్ సన్నివేశాలను కూడా అదే స్థాయిలో తెరకెక్కించారు. అన్నిరకాల భావోద్వేగాలను లేడీ డైరెక్టర్ ఇంత బాగా ప్రజెంట్ చేయగలరా అని ఆమెతో ప్రయాణించాకే నాకు అర్థమైంది. ఇందులోని సన్నివేశాలు గతంలో చూడనివిధంగా విభిన్నంగా ఉంటాయి. గీతూ గొప్ప రచయిత కూడా.. ఆమె నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని యశ్ అన్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యశ్ సరసన ఐదుగురు హీరోయిన్స్ నటిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com